

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (4)*

**అమ్మో, నిన్ను!** (ఇండియా–జర్మనీ శ్రీమతి ప్రయాణ విశేషాలు)

శ్రీమతి కథ చెప్పడం ఐపోయింది. తన మనసులోని భారమంతా దిగిపోయినట్లు ఆమె గొంతు వినగానే తెలిసిపోయింది నాకు.

"ఆకాశాన్ని హెర్క్యులెస్ భుజంమీద పెట్టి బరువు దింపుకున్న అట్లాస్‌లా ఎంత హాయిని అనుభవిస్తున్నావో, నీ ముఖం చూడగానే తెలుస్తోంది" అన్నాను.

"మెయిన్ లైట్ ఆర్పేశారు. బెడ్‌లైట్ లేదు. మీ చేతిలో కనీసం బ్యాట్రీలైటేనా లేదు. ఈ చీకటిలో మీకు నా ముఖమెలా కనిపించిందీ" అంది శ్రీమతి వెంటనే.

ఇలాంటి విషయాల్లో తను తెనాలి రామకృష్ణుడికంటే కూడా షార్ప్.

అలనాడు విజయనగరం కొలువులో ఒక సందర్భంలో పెద్దనామాత్యుడు శ్రీకృష్ణదేవరాయల్ని ప్రశంసిస్తూ 'కొండ గుహలో మూల మూల నక్కి నివసిస్తుంది కాబట్టి కానీ, లేకుంటే నిన్ను సింహమంతటివాడివి అనొచ్చు' అనే అర్థంతో ఓ పద్యం చెప్పి చివర్లో రాయల్ని – కృష్ణా, రాజకంఠీరవా అని సంబోధిస్తాడు. అంటే రాజసింహమా అని అర్థం. అప్పుడు పెద్దనగారి మొదటి మాటకీ చివరి మాటకీ పొంతన లేదన్న విషయాన్ని ఠక్కున ఎత్తి చూపాడట తెనాలి రామకృష్ణుడు. ఖంగు తిన్న పెద్దన గారు, 'మంచి పట్టే పట్టావు మనవడా' అని సద్దుకుంటాడు.

ఇప్పుడు శ్రీమతి నన్నూ అలాంటి పట్టే పడితే, "రాత్రి పూట చందమామని చూడ్డానికి బ్యాట్రీలైటు కావాలా?" అని సద్దుకున్నాను.

ఒక్క నిముషం తను సైలెంటయిపోయింది.

ఊరుకుంటే సరిపోయేదిగా, "ఇప్పుడు నీ మొహం ఎఱ్ఱబడిన విషయం కూడా గమనించాను తెలుసా?" అన్నాను మరికాస్త రెచ్చిపోయి.

"ఎఱ్ఱబడదూ! ఎన్నో నెలల తర్వాత కలుసుకున్న దంపతులం. ఒకరికొకరు ఎలా కనిపించాలి? చందమామ అని కవరప్ చేసుకున్నంత మాత్రాన, అంతకుముందన్న మాట నేను మర్చిపోగలనా? ముఖం ఎఱ్ఱబడిందంటే పడదూ!" అంది శ్రీమతి.

సిగ్గుతో ముఖం ఎఱ్ఱబడిందని నేనన్నాను. కోపంతో ఎఱ్ఱబడిందని ఆమె అంటోంది. ఆమె గొంతులో మాత్రం సిగ్గూ లేదు, కోపమూ లేదు. ఐనా నా పొగడ్తకు సిగ్గుపడితే – అది సహజం కానీ – కోపగించుకోవడమెందుకు?

అదే అడుగుదామనుకున్నాను కానీ సూటిగా అడగలేదు. తనని అంత తేలికగా తీసుకుందుకు లేదు.

నేనన్న మాటల్లో కోపగించుకోవాల్సింది కూడా ఏదైనా ఉందేమో అని పునశ్చరణ చేసుకున్నాను. ఎంత ఆలోచించినా స్ఫురించలేదు. అనవసరంగా సమయం వృథా చేస్తున్నాననిపించి, "చాలాకాలం తర్వాత కలుసుకున్నాం. ప్లీజ్ – నా తప్పేమిటో త్వరగా చెబితే మనమింకా పంచుకోవాల్సిన విశేషాలు చాలా ఉన్నాయి" అని ఇంకో రూట్లో వెళ్లి బ్రతిమాలాను.

ఏమనుకుందో, తనూ ఆట్టే జాప్యం చెయ్యకుండా – "నన్ను అట్లాస్‌తో పోల్చారు. అంటే ఓ రాక్షసుడు కనిపించాడా మీకు నా ముఖంలో" అని నిలదీసింది.

నాలిక్కరుచుకున్నా వెంటనే తమాయించుకుని, "నీ ముఖంలో నేను చూసింది రాక్షసుణ్ణి కాదు. ఆకాశమంత బరువైన బాధ్యతల్ని మోసే ఓ మహత్తర వ్యక్తిని. కథలో ఆ వ్యక్తి రాక్షసుడు కావచ్చు. కానీ, నిజానికి నీలాంటి ఇల్లాలికి ప్రతిరూపం అట్లాస్ పాత్ర. పురుషుడు

హెర్క్యులెస్ లాంటివాడు. తన అవసరం తీరేదాకా నాలుగు మంచి మాటలు చెప్పి, ఆకాశమంత భారాన్ని కొద్ది క్షణాలు మాత్రం భరించినట్లే భరించి – తర్వాత మాయ చేసి మళ్లీ అట్లాస్‌కే అంటగట్టి తను హీరోగా చెలామణీ ఔతాడు. ఈ కథలో మనకి తెలియకుండానే పురుషాధిక్యం భ్రమలో ఎంతలా పడిపోతామంటే, ఆకాశాన్ని మోస్తున్న అట్లాస్ గొప్ప హీరో అని క్షణమాత్రం కూడా స్ఫురించదు" అన్నాను.

ఫక్కున నవ్వింది శ్రీమతి. "మీరేం చెబుతారో నా ఊహకెప్పుడూ అందదు. కానీ ఏం చెప్పినా వినడానికి బాగుంటుంది. ఈ కబుర్లే ఇన్ని నెలలుగా మిస్సయిపోతున్నాను. చాలా బాగుంది. ఇంకా ఏమైనా చెప్పండి" అంది.

నాకూ తనతో ఇంకా ఇంకా మాట్లాడాలనుంది. కానీ మాటల్లో పడ్డామంటే ఇట్టే తెల్లారిపోతుంది. ఆ తర్వాత నిద్రమత్తు వదలక, మిగతా రోజంతా జోగడమే ఔతుంది. పగలంతా వృథా ఐపోతుంది. అందుకని, "ఆడది చాలా గొప్పది. 'ఏడవకు ఏడవకు వెర్రి నా తండ్రీ' అంటూ ఏడుపులోని విషాదాన్ని ఆమె గానం చేస్తే అది బిడ్డకు మాధుర్యపు మత్తునిచ్చే జోలపాటగా మారిపోతుంది. భర్తకోసం తను పడ్డ ఆరాటాన్ని కథగా వినిపిస్తే అది భర్తకు మాధుర్యపు మత్తునిచ్చే జోలపాటగా మారిపోతుంది. ప్రస్తుతానికి నాకీ మత్తునుంచి బయటపడాలని లేదు. నేను చెప్పాల్సింది చాలా ఉంది. అదంతా రేపు శుభోదయంలో సంధ్య వారుస్తూ చెబుతాను" అన్నాను.

అలసి సొలసిన తనకి నిద్ర అవసరమంటే ఆమె ఒప్పుకోదు. అదే నాకు నిద్ర వస్తోందంటే మాత్రం నన్ను డిస్టర్బ్ చెయ్యడానికి ఇష్టపడదు. ఆ విషయం నాకు తెలుసు.

శుభోదయంలో సంధ్య వార్చడమేమిటని శ్రీమతి నన్నడగలేదు. మరి మాట్లాడలేదు.

ఆ తర్వాత కళ్లు తెరిచేసరికి తెల్లారిపోయింది.

నేనెక్కడున్నానూ, అసలేం జరిగిందీ అన్నది స్ఫురణకు రావడానికి కొన్ని క్షణాలు పట్టింది. అప్పుడు పక్కకి తిరిగి చూస్తే – ఎప్పుడు నిద్ర లేచిందో కానీ, తను నన్నే రెప్పలార్పకుండా చూస్తోంది.

"రాత్రి నిద్ర పట్టలేదా?" అన్నాను అనుమానంగా.

"కొత్త చోటు. నిద్ర పడుతుందా అని భయపడ్డాను. కానీ కళ్లు మూసుకున్నాక వళ్లు తెలియలేదు. కళ్లు తెరిచి ఐదు నిముషాలయింది. చూస్తే అటు పిల్లలు. ఇటు మీరు. అటు నిజమే కానీ ఇటు కూడా నిజమేనా లేక కలా అన్న అనుమానంతో వళ్లు గిల్లుకున్నాను. కల కాదు, నిజమే అనిపించినా – కళ్లు మూస్తే ఇదంతా మళ్లీ కలగా మారిపోతుందేమోనని భయం. మిమ్మల్నే చూస్తున్నాను" అంది శ్రీమతి.

ఉన్నట్లుండి నాకూ అదే భయం కలిగింది. ఒకసారి పిల్లలిద్దర్నీ తడిమి చూసుకున్నాను.

పాప, బాబు మంచి నిద్రలో ఉన్నారు. అప్పుడే నిద్ర లేచేలా లేరు. టైం చూసుకుంటే ఇంకా ఆరు కాలేదు.

"ఈరోజునుంచి మనకో కొత్త జీవితం మొదలౌతుంది" అన్నాను.

"ఇప్పుడు మనమంతా ఒక్కచోట ఉన్నాం. అందుకే కొత్తచోటైనా రాత్రి ఇంత మంచి నిద్ర పట్టింది. కానీ పాపం, మీరు ఇదే ఇంటికొచ్చినప్పుడు మొదటి రాత్రి ఒక్కరే ఉన్నారు. ఎలా అనిపించింది?" అంది శ్రీమతి.

ఒక్క క్షణం ఆలోచించాను. ఆ రోజు గుర్తు చేసుకున్నాను.

"నిజం చెప్పాలంటే, కొత్త చోటైనా నాకూ ఇక్కడ బాగా నిద్ర పట్టింది. కారణమేమిటంటే – మన సంస్కృతీ సంప్రదాయాలకు పూర్తిగా భిన్నమైన ఒక మహానగరంలో – నావంటి సామాన్యుడికి నిలువనీడ దొరికిందన్న సంతృప్తి! కానీ....." ఆగాను.

"ఊఁ, కానీ...." కుతూహలంగా అడిగింది శ్రీమతి.

"మన పెళ్లయ్యేక – ఇల్లు మారినా, ఊరు మారినా – అన్నింటికీ నువ్వు నా పక్కనున్నావు. మంత్రాలకు అర్థం తెలియకపోయినా, అనాలోచితంగా పురోహితుడి మాటల్ని అనుసరిస్తూ – సంప్రదాయ వ్యవహారాల్ని పాటించినట్లుండేది నాకు అలాంటి సందర్భాల్లో. అంటే నీది

పౌరోహిత్యం. నాది అనుసరణ. అలా అలవాటైన నేను బెర్లిన్లో కొత్తింట్లో ఒంటరిగా అడుగు పెట్టేసరికి అంతా గజిబిజిగా అనిపించింది. ల్యూనబర్గులో ఉండలేదా అనొచ్చు నువ్వు. అక్కడ నా స్వంత బాధ్యత ఏమీలేదు. అన్ని ఏర్పాట్లూ గ్యోతే ఇన్స్టిట్యూట్ వాళ్ళవే. కానీ ఇక్కడ నేనో ఉద్యోగిలాంటివాణ్ణి. పక్కన నువ్వు లేకపోతే ఇంటి వ్యవహారాలు చూసుకోవడం ఎవరెస్టు ఎక్కడమంత కష్టం నాకు. అలా అలవాటు చేశావు" అన్నాను.

శ్రీమతి ముఖం వెలిగింది. "నెపం నామీదకు నెట్టకండి. అలా సాగించుకున్నారు మీరు" అని, "ఇక్కడి విశేషాలు చాలావరకూ నాకు ఉత్తరాల్లో రాశారు కానీ – ఈ ఇంట్లో మొదటి రోజు గురించి రాయలేదు. అది చాలా ప్రత్యేకమని ఇప్పుడనిపిస్తోంది...." అని ఆ వివరాలు చెప్పమన్నట్లు చూసింది.

"తెల్లారి లేవగానే సూర్యుడికి నమస్కరించాలి. మన మనుగడకి అవసరమైన సమస్త శక్తుల్నీ సమకూరుస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికే సంధ్యావందనం హిందూ సంప్రదాయమైంది....." అన్నాను ఉపోద్ఘాతంగా.

"మీరు సంధ్యావందనం చెయ్యడం నేనొక్కసారి కూడా చూడలేదు" అంది శ్రీమతి వెంటనే.

"ఆకాశంలో ఉండే వాడొక్కడేనా సూర్యుడు? దేవుణ్ణి పలు రూపాలలో సందర్శించడం హిందూ సంప్రదాయం. అలా నా సూర్యుడు నువ్వే. చాలా నెలల తర్వాత నాకు శుభోదయం వచ్చింది. ఆ సందర్భంగా నా సూర్యుడిముందు నేనిప్పుడు సంధ్య వార్చబోతున్నాను" అన్నాను.

"అంటే?"

"నీ రాకకు ముందు నేనీ ఇంట్లో గడిపిన మొదటిరోజు విశేషాలు చెప్పడంలోనే – నీకు కృతజ్ఞతలు ఇమిడి ఉన్నాయి"

"అదెలా?"

"నేను ఇబ్బంది పడితే నువ్వు లేని లోటును స్మరించినట్లు! ఇబ్బంది పడకపోతే – నీ సాహచర్య ప్రభావం నాకు తెలియకుండానే నామీద పడినట్లు...." అన్నాను.

శ్రీమతి కుతూహలం రెట్టింపయింది. నేను మొదలెట్టాను....

శుభోదయంలో సంధ్యవార్పు

ఈ ఇంట్లోకి ఆ రాత్రి ఎలా ప్రవేశించానో నీకు తెలుసు.

కొత్త చోటైనా ఆ రాత్రి ఇంట్లో నాకు నిద్ర చాలా బాగా పట్టింది. అలసట మాత్రమే కాక, నిలువనీడ దొరికిందన్న సంతృప్తి కూడా అందుకు కారణం కావచ్చు.

ఈరోజులాగే ఆరోజూ ఆరింటికి నిద్ర లేచి బ్రషింగ్ వగైరా కాలకృత్యాలకు బాత్రూంకి వెళ్లాను. ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ బాత్రూంకంటే ఇది పెద్దది. స్నానానికి బాత్ టబ్ కూడా ఉంది. కానీ అక్కడిది మంచి హొటల్లో బాత్రూంలా ఉంటే – ఇది ఏదో రైల్వే స్టేషన్లో వెయిటింగ్ రూంలో పదిమంది వాడుకుంటున్నదానిలాగానూ, మెయింటెనెన్సు లేనట్లూ ఉంది. మన దేశం స్థాయిలో ఐతే ఏమో కానీ, జర్మన్ల స్థాయిలో బాత్రూం ఇలా ఉంటుందని నేనూహించలేదు. కొంచెం నిరుత్సాహపడినప్పటికీ, స్నానానికి సదుపాయముందని సంతోషించాను. వేణ్ణీళ్ల సదుపాయం కూడా బాగుండడంతో స్నానం హాయిగా అనిపించింది.

స్నానమయ్యేక నాలుగు బ్రెడ్ స్లైసులు, ఓ ఆపిల్ – తిని, అరలీటరు పాలు తాగాను.

అంతలో "హెర్ డాక్టర్" అన్న పిలుపు వినిపించింది. అది ఒలోముచ్కీ గొంతు.

నేను వెళ్లగానే ఆమె, "నీకు బయట వేరే పనులుంటే చూసుకో. పదకొండింటికి వస్తే ఇంటి తాళం ఇస్తాను" అంది.

సరేనన్నాను. చకచకా నడిచి టెక్నికల్ యూనివర్సిటీలో ఔస్‌లాండ్స్ ఆమ్ట్‌కి (విదేశీయులకి సహకరించే ఆఫీసు) వెళ్లాను. ముందురోజు అహమ్మద్‌తో తిరగడంవల్ల ఆ పరిసరాలమీద నాకు కొంచెం పట్టు వచ్చింది.

ఆ ఆఫీసులో నాకు పనికొచ్చే విశేషాలు చాలా తెలిశాయి. ముందుగా వాళ్లు చెప్పిన చోటుకెళ్లి స్కాలర్‌షిప్ తీసుకున్నాను. కొత్తగా బెర్లిన్ వచ్చినందుకు ఇచ్చే అలవెన్సులతో కలిపి 1200 మార్కులు చేతికందేసరికి ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. నిన్న ఒలోముచ్‌కీకి అద్దె డబ్బులిచ్చేకకూడా ఇంకా నా బ్యాంక్ అకౌంట్లో రెండువేల మార్కులున్నాయేమో – ఒక్కసారిగా టాటా బిర్లాల్లా ఫీలైపోయాను.

స్కాలర్‌షిప్ తీసుకునేచోట చెయ్యెత్తు భారీ మనిషి ఒకతను నన్ను చూసి ఆప్యాయంగా పలకరించాడు. అతని పేరు గోపాలకృష్ణన్. తమిళుడు. ప్రతిష్ఠాత్మకమైన వాన్ హుంబోల్‌డ్ట్ స్కాలర్‌షిప్‌మీద వచ్చేడు. ఆ స్కాలర్‌షిప్ నా డాడ్ స్కాలర్‌షిప్ కంటే ఎక్కువ, గొప్పది. నెలకి 1600 మార్కులు. అంతే కాదు, వాన్ హుంబోల్‌డ్ట్ స్కాలర్సుకి ఇంకా ఎన్నో అదనపు సదుపాయాలు కూడా ఉంటాయి. అతన్ని కలుసుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. తర్వాత అతడి గురించిన విశేషాలు నీకు ఉత్తరాల్లో వ్రాశాను కదా!

అక్కణ్ణించి బెర్లినర్ డిస్కోంటో బ్యాంకుకి వెళ్లాను. అది ల్యూనబర్గులోని డాయిచ్ బ్యాంక్‌కి బెర్లిన్‌లో ఉండే అనుబంధ సంస్థ. నా డబ్బులు ఆ అకౌంట్లోనే ఉన్నాయి. ఆ అకౌంట్‌ని ల్యూనబర్గునుంచి ఇక్కడికి మార్చినందుకు 5 మార్కులు తీసుకున్నారు. ఇప్పుడు తీసుకున్న 1200 మార్కులు ఆ అకౌంట్లో జమ చేసి, పదకొండుకల్లా ఒలోముచ్‌కీ ఇల్లు చేరాను.

ఒలోముచ్‌కీ మాటంటే మాటే! నేను రాగానే ఆమె వెంటనే ఇంటి తాళం నా చేతిలో పెట్టింది. “నాలుగింటికి మాత్రం నువ్వు తప్పకుండా ఇంట్లో ఉండాలి సుమా, ఇంతకు ముందుండే అతను వచ్చి రూం ఖాళీ చేసి వెడతాడు” అని హెచ్చరించి వెళ్లిపోయింది.

నేను కూడా ఇక ఇంట్లో ఉండలేదు. మరికొన్ని లాంఛనాలు ముగించుకుందుకు మళ్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఆఫీసుకెళ్లాను. అప్పుడో విషయం తెలిసింది. నేను ఇన్సూరెన్సు తీసుకుని తీరాలట.

నాకు ఇన్సూరెన్సుమీద ఆసక్తి లేదు. అంతవరకూ నేను ఇండియాలో ఇన్సూరెన్సు తీసుకోలేదు. ఇన్సూరెన్సు అర్థాంతర మరణం చెందేవారికే తప్ప పూర్ణాయుష్కులకు ఇచ్చే సదుపాయాలు ఏమీ లేవని నాకు అనిపించేది.

అందుకే ఇక్కడా కొద్దిగా ప్రతిఘటించాను.

ఇన్సూరెన్సు చేయించే బాధ్యత ఆ ఆఫీసులో ఫ్రౌ బాడెన్ అనే మధ్యవయసు మహిళ తీసుకుంది. ఆమె వేగంగా జర్మన్ మాట్లాడుతోంది. టెక్నికల్ యూనివర్సిటీ వివరాలు ఇంగ్లీషులో లభించే బుక్‌లెట్ గురించి అడిగితే, ఇక్కడ అన్నీ జర్మన్‌లోనే ఉంటాయంది. ఆమె వ్యవహారం కొంచెం మోటుగా, కొంచెం కటువుగా, కొంచెం విసుగ్గా తోచింది నాకు. మొట్టమొదటే ఆమె నాకు తటస్థపడి ఉంటే బహుశా నాకు జర్మన్సుమీద చాలా చెడ్డ అభిప్రాయం ఏర్పడి ఉండేది. ఏ దేశమేగినా అన్ని రకాలవారూ ఉంటారు మరి!

ఇన్సూరెన్సు చేసి తీరాలని కూడా ఆమె మోటుగానే చెప్పింది. జర్మనీలో వైద్యసేవలకు ఖర్చెక్కువనీ, సామాన్యులది భరించలేరనీ, 16 మార్కులకి ఇన్సూరెన్సు తీసుకుంటే – అక్కడ ఏ అనారోగ్యమొచ్చినా ఉచిత వైద్యసేవలు అందుతాయనీ చెప్పింది. ఈ సదుపాయం గొప్పతనం అందరికీ అర్థంకాదనీ, అందుకే డాడ్ సంస్థ తమ స్కాలర్సుకి ఇన్సూరెన్సు తప్పనిసరి చేసిందనీ అంది.

జర్మనీలో ఉండగా జిర్రున చీదనైనా చీదనని నా నమ్మకం. ఉత్తపుణ్యాన నెలనెలా బిళ్లగొడుగుల్లా 16 మార్కులు ఇన్సూరెన్సు కంపెనీకి చెల్లించాలనీ అనిపించినా చివరకు తప్పలేదు. ప్రీమియం రేపు కట్టాలి.

ఫ్రౌ బాడెన్ మోటుగానే చెప్పినా – ఆమె నాకు మేలే చేసిందనీ, ఇక్కడి ఇన్సూరెన్సు ఇండియాలోలాంటిది కాదనీ తర్వాత మనవాళ్లు చాలామంది నాకు చెప్పారు.

అదయ్యేక అక్కణ్ణించి ఓ సూపర్ మార్కెట్‌కి వెళ్లాను. వేడినీళ్లలో వేసి రెండు నిముషాలుంచితే – ఉడికి అన్నంగా మారిపోయే బియ్యం ప్యాకెట్లు రెండు కొన్నాను. ఇంకా వెన్న, బ్రెడ్డు, జామ్, పాలు, పళ్లు వగైరాలు కొని నాలుగు కాకుండానే ఇల్లు చేరాను.

ఇంట్లోకెడదామని తాళం తీస్తే అది పనిచెయ్యలేదు. రెండు సార్లు ప్రయత్నించాను. ఐనా తాళం పని చెయ్యలేదు.

దేశం కొత్తది. ఊరు ఇంకా కొత్తది. నేనలా పలుమార్లు ప్రయత్నిస్తూండగా చూస్తే ఎవరైనా నన్ను దొంగ అనుకోవచ్చునని భయపడుతూ, సాయానికెవరైనా వస్తారేమోనని కాసేపు అటూ ఇటూ చూశాను. పది నిముషాలు గడిచినా ఎవరూ రాకపోయేసరికి మనసులో దేవుణ్ణి తల్చుకుని మూడో ప్రయత్నం చేశాను. అదీ ఫెయిలయింది.

అప్పుడొచ్చాడు నేనుండే గది కాళీ చేయాల్సిన టర్కిష్ వ్యక్తి. ఇద్దరం ఒకరినొకరు పరిచయం చేసుకున్నాం.

అతను నా సమస్య విని – ఆ తాళం ఎలా తియ్యాలో సులువు చెప్పి నాచేతే తీయించాడు.

అతగాడు నిజంగా ఇల్లు కాళీ చెయ్యాల్సిన వ్యక్తేనా, లేక ఏ తాళాన్నయినా ఇట్టే తియ్యగల చోరాగ్రేసరుడా అని నాలో చిన్న అనుమానం.

అలాగే ఇంట్లోకెళ్లాం.

నా అనుమానానికి తగ్గట్లే అతగాడు లోపలికెళ్లాక సామాన్లు ప్యాక్ చేసుకుంటూ గదిలో చాలా సేపున్నాడు. ఆ సామానంతా అతడిదేనా అన్న శంక నన్ను పీడించింది.

సామాను చాలా ఉంది. కానీ, అంత సామానుకీ అతనివద్ద పెట్టె మాత్రం ఒకటే ఉంది. సామాను పైనుంచి మెట్లకింద ఉన్న టాక్సీలోకి రవాణా చెయ్యడానికి అతను నా సూట్‌కేస్ అడిగాడు.

మళ్లీ అనుమానం. కానీ ఇవ్వననలేను. భయం భయంగానే ఇచ్చాను.

నా పెట్టె నాకు వెనక్కొచ్చేదాకా మనసు పీకుతూనే ఉంది. అతను వెనక్కొచ్చి మోసం చెయ్యకుండా నా పెట్టె నాకు తిరిగివ్వగానే అప్రయత్నంగా థాంక్స్ చెప్పాను.

అతగాడు ఆశ్చర్యంగా, "పెట్టె ఇచ్చింది నువ్వు. థాంక్స్ నేను చెప్పాలి" అన్నాడు.

మనసులోని అనుమానం బయటకు చెప్పలేనుగా – కవర్ చేసుకుందుకు – "తాళం తియ్యడం నేర్పావు కదా, అందుకు" అన్నాను తెలివిగా.

అప్పుడు చెప్పకుండా ఇప్పుడు చెబుతున్నాడేమిటా అనేమో అతగాడు మళ్లీ నన్ను ఆశ్చర్యంగా చూశాడు.

వెళ్లిపోయేముందు నా వివరాలడిగి తెలుసుకుని, "నీకు నెలనెలా 900 మార్కులు వచ్చే మాటైతే, ఇంతకంటే మంచి ఇంట్లో ఉండొచ్చు. ఈ ఇంటామె మంచిదే కానీ, మహా ఎడ్డిది. రెండు రోజులుగా టాయ్‌లెట్ సరిగ్గా ఫ్లష్ అవడంలేదు. చెప్పినా ఇంకా పట్టించుకోలేదు. తనూ అలాగే వాడేస్తోంది" అని నా గుండెల్లో ఓ రాయేసి వెళ్లిపోయాడు.

ఉదయం నేను కమోడ్ వాడిన విషయం గుర్తు చేసుకున్నాను. బాగానే పని చేసిందని తోచినా, హడావుడిలో గమనించలేదేమో – అంది గుండెల్లో రాయి.

అతను వెళ్లగానే ముందు అన్నం వండుకున్నాను. ఇండియానుంచి తెచ్చుకున్న టమేటా ఊరగాయని వేడి వేడి అన్నంలో వెన్నతో కలుపుకుని తింటుంటే జిహ్వ లేచొచ్చింది.

భోజనమయ్యేక రేడియో పెట్టుకున్నాను. ఢిల్లీ చాలా స్పష్టంగా పలికింది. చాలా బాగా అనిపించింది కానీ ఎంతో సేపు వినలేదు. నాకు తెలియకుండానే నిద్ర ముంచుకొచ్చి వళ్లెరక్కుండా నిద్రపోయాను.

మర్నాడుదయం లేచి తెమిలాను. టర్కిష్ అతను చెప్పినట్లే టాయ్‌లెట్ బాగోలేదు.

వేణ్ణీళ్ల స్నానం చేసేక – నాలుగు స్లైసులు బ్రెడ్డు జామ్‌తో, 2 గ్లాసుల పాలు, ఒక అరటిపండు – అదీ టిఫిన్. ఇకమీదట రోజూ ఉదయం పూట ఇలాగే తినాలనుకున్నాను.

ఆఫీసుకి వెళ్లేటప్పుడు టాయ్‌లెట్ విషయం ఇంటామెకి చెబితే, "అలాగా, చూస్తాన్లే" అంది. ఆ మాట మన ఫిర్యాదులకు మన దేశంలో మునిసిపాలిటీవాళ్ల స్పందనలా ఉంది.

ఆఫీసు చేరేసరికి అక్కడ అంతా నన్ను ఆప్యాయంగానూ, ముచ్చటగానూ చూశారు. తెలిసినవారు తెలియనివారికి డాక్టర్ అంటూ అబ్బురంగా, గౌరవంగా పరిచయం చేశారు. ఐతే ఓసారి పలకరింపులైపోగానే, ఎవరి పని వారిదే. మరి బాతాఖానీ లేదు.

సంస్కారం దెబ్బ తినకుండా బాధ్యతకు పెద్ద పీట వేసే ఈ సంస్కృతి చాలా గొప్పగా అనిపించింది. ఇలాంటిది మన దేశంలోనూ ఉద్యోగులందరూ పాటిస్తే – అది ఎన్నో సంస్కరణల పెట్టు అని నాకు అనిపించింది.

నేను 12 అయ్యేదాకా ఆఫీసులో ఉన్నాను. అక్కణ్ణించి బ్యాంకుకి వెళ్లి ఇన్సూరెన్సు ప్రీమియం 16 మార్కులు కట్టేసి ఇల్లు చేరుకున్నాను.

ఇంటిముందే పెద్ద కూరగాయల సంత. అది చూసి ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా కలిగింది.

ఆ రోజు బుధవారం. ఇక్కడ ప్రతి బుధవారం, శనివారం సంత ఔతుందిట. అంటే తాజా కూరలు కొనేందుకు నేను ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. మన ఇంటి మెట్లు దిగి వీధిలోకి వస్తే చాలు.

సంతలో హుషారుగా తిరిగి కొన్ని పళ్లు, కూరలు కొన్నాను. ఇంటికొచ్చి ల్యానబర్గులో కొరియా నేర్పిన బంగాళాదుంపల కూర వండి, నిన్న రాత్రి మిగిలిన అన్నంతో భోంచేశాను. వంటకి అనుభవమెంత ముఖ్యమో అప్పుడు తెలిసింది. కూర పక్వాన పడలేదు.

భోంచేసేక మళ్లీ ఆఫీసుకెళ్లాను. ఇండియానుంచి ఉత్తరాలేమైనా వచ్చాయేమోనని వాకబు చేశాను. ఇంకా రాలేదంటే నిరుత్సాహం. అప్పుడు అక్కడ ఆ ఉత్తరాలే నా ఊపిరి మరి!

ఆఫీసులో అంతా ఎవరి పనుల్లో వారుండి నా రాకపోకలగురించి పట్టించుకోలేదని గ్రహించగానే నాలోని భారతీయుడు వెన్ను తట్టాడు. ఆఫీసు ఐదు దాకా ఉంటుందని తెలిసినా, పని లేనప్పుడు ఇక్కడుండి ఏంచేస్తానులే అనుకుని – నాలుగింటికే అక్కణ్ణించి బయల్దేరాను. రెండుమూడు సూపర్ మార్కెట్లు తిరిగాను. ఒకచోట కేజీ 2.28 మార్కులకే బియ్యం దొరికితే కొన్నాను. ఆల్‌బ్రెష్ట్ ఐతే ఇంతకంటే చౌకగా ఉంటుందికదా అనుంది కానీ, ఆ దుకాణమెక్కడో ఇంకా తెలియదు.

ఓ మార్కెట్లో ఇద్దరు ఇండియన్సు కనిపించారు. వాళ్లను చూడగానే నాకు చెప్పలేనంత ఉత్సాహం కలిగింది. వెంటనే పలకరించి పరిచయం చేసుకోవాలనిపించింది.

నా చూపుల్లో అది పసికట్టారో ఏమో, వాళ్లే నన్ను పలకరించి "ఇండియన్?" అనడిగారు.

ఏ భాషలో బదులివ్వాలో తెలియక ఔనన్నట్లు తలూపాను.

వాళ్లింకా ఏదో అడుగుతారనీ, మాటలు పెంచాలనీ అనుకున్నాను కానీ, వాళ్లు ఓ చిరునవ్వు నవ్వి హడావుడిగా వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లిపోయిన తీరు చూస్తే – నేను ఇండియన్ అని తెలియగానే, వాళ్లు నన్ను ఎవాయిడ్ చేస్తున్నారనిపించింది. 'అసలు సిసలు మనవాళ్లు' అని మనసులో అనుకుని నవ్వుకున్నాను.

ఆ రాత్రి వంట, భోజనం మామూలే. భోజనమయ్యేక టేపు రికార్డర్లో పిల్లల మాటలు, పాటలు విన్నాను.

బెర్లిన్ మహానగరంలో మన పిల్లల మాటలు, పాటలు. అపూర్వంగా అనిపించింది. కానీ కాసేపు వినేసరికి వాళ్లని దగ్గరగా తీసుకోవాలనిపించింది. సాంకేతిక విజ్ఞానం వాళ్ల మాటల్ని నా చెవులకి చేర్చగలిగింది. కానీ నా చేతుల్ని వాళ్ల దగ్గరకు చేర్చలేదని తెలుసు. మనసు పాడౌతుందని భయమేసి టేపునుంచి రేడియోకి మారాను. ఢిల్లీలో హిందీ పాటలు వస్తున్నాయి.

ఉన్నట్లుండి లతా మంగేష్కర్ గొంతులో ఆనంద్ బక్షి అంటున్నాడు – 'జానె క్యూం లోగ్ మొహబ్బత్ కియా కర్తే హైం'. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ మెలొడీస్‌లో నాకెంతో ఇష్టమైన పాట అది. ఆ సమయంలో నా మనోభావాలకి అద్దం పడుతున్న ఆ పాట వింటూండగా కళ్లు మూతలు పడ్డాయి.

"రోజూ ఇలాగే నిద్రపడితే చాలు. ఎంతో బాగుంటుంది" అనుకుంటూ రేడియో కట్టేశాను.

ఆ క్షణంలో నేనూహించలేదు. నిద్రతో నిమిత్తం లేకుండా – ప్రతి రోజూ అద్భుతం అనిపించే రోజులు ముందున్నాయని....

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments